క్లుప్తంగా

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శ



మీరాయమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: మాతృమూర్తిని కోల్పోయి, బాధలో ఉన్న మండలంలోని శ్రీకృష్ణపట్నానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మండారపు గంగాధర్‌ను స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పరామర్శించారు. సోమవారం జరిగిన పెద్దకర్మలో పాల్గొని, మృతురాలు మీరాయమ్మ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు.

భారీ అన్న సమారాధన

బిక్కవోలు: కొంకుదురు బుడిత మామిడి వద్ద ఉన్న బాలత్రిపుర సుందరి సమేత త్రిముఖ లింగేశ్వరస్వామి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన జరిగింది. సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ పడాల వెంకటరామారెడ్డి ఆధ్వర్యంలో, ఆయన తల్లిదండ్రులు పడాల రామిరెడ్డి, కాంతమ్మ, కుమార్తె పద్మావతి జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎన్ఎంఎంఎస్‌కు 14 మంది ఎంపిక

మధురపూడి: కోరుకొండ మండలంలోని ఐదు హైస్కూళ్ల నుంచి 14 మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారని ఎంఈఓ కుశలవ దొర తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ద్వారానే ఇది సాధ్యమైందన్నారు. శ్రీరంగపట్నం నుంచి 8 మంది, కోరుకొండ నుంచి ముగ్గురు, బొల్లెద్దుపాలెం, మధురపూడి, గాదరాడ నుంచి ఒక్కొక్కరు ఎంపికైనట్టు తెలిపారు. శ్రీరంగపట్నం నుంచి అధికంగా ఎంపిక కావడంపై ఉపాధ్యాయులను అభినందించారు. ఎంపికైన విద్యార్థులకు 8, 9, 10 తరగతుల్లో ఏడాదికి రూ.12 వేలు చొప్పున స్కాలర్‌షిప్ లభిస్తుందన్నారు.

సీతానగరం మండలంలో 59,036 మంది ఓటర్లు

సీతానగరం: మండలంలో 59,036 మంది ఓటర్లు ఉన్నారని తహసీల్దార్ పాగిరి కృష్ణారావు తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ గతంలో పురుషులు 29,070 మంది, స్త్రీలు 29,798 మంది, థర్డ్ జెండర్ 3తో కలిసి 58,871 మంది ఉండేవారన్నారు. కొత్త జాబితా ప్రకారం ఓటర్లలో పురుషులు 29,107 మంది, స్త్రీలు 29,928 మంది, ఇతరులు ఒకరితో కలిసి 59,036 మంది ఉన్నారని తెలిపారు. ఓటర్ల జాబితా పరిశీలనలో ఉందని, స్వల్ప మార్పులు ఉండవచ్చన్నారు.

ఎంపీడీవో రమేష్ బదిలీ

సీతానగరం: ఎంపీడీవో కె.రమేష్ పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయనకు ఆ జిల్లాలోని ఏ మండలం కేటాయించిందీ ఇంకా తెలియలేదు. సీతానగరానికి కృష్ణా జిల్లా నుంచి బదిలీపై వస్తున్నట్లు సమాచారం.

పేకాట ఆడుతున్న ఇద్దరి అరెస్టు

సీతానగరం: మండలంలోని వంగలపూడి శివారున పేకాడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశామని ఎస్సై టి.రామకృష్ణ సోమవారం తెలిపారు. వారి నుంచి రూ.1,860 స్వాధీనం చేసుకున్నామని, నిందితులను కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం



గంగన్నకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ పర్యవేక్షకురాలు శ్రీదేవి

సీతానగరం: వాడపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన భవన నిర్మాణానికి చినకొండేపూడికి చెందిన కర్లపూడి గంగన్న, చిట్టమ్మ దంపతులు ఈనెల 26న రూ.1,11,111 విరాళం అందజేశారు. దేవస్థానం పర్యవేక్షకురాలు శ్రీదేవి వారికి స్వామివారి చిత్రపటం అందించారు. కర్లపూడి రామ్ శేఖర్, కర్లపూడి జయలక్ష్మి, గద్దె సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి బీజేపీలో చేరిక

రంగంపేట: పెదరాయవరం గ్రామంలో టీడీపీకి చెందిన సోషల్ మీడియా యాక్టివిస్ట్ బచ్చల విజయ్ బీజేపీలో చేరాడు. సోమవారం బీజేపీ అనపర్తి నియోజకవర్గ కన్వీనర్ ఎంఎస్ఆర్కే రాజు ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దత్తు సమక్షంలో కండువా వేసి, విజయ్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి హారిక, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మద్దిపాటి రజని, జిల్లా కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు మద్దిపాటి వరప్రసాద్, మండల అధ్యక్షుడు సాయిరాం పాల్గొన్నారు.

పాడి రైతుకు భరోసా

- పశు బీమా ప్రీమియం చెల్లింపులో రాయితీ
- మూడేళ్ల కాలానికి లబ్ధిదారుల వాటా కింద 20 శాతం
- పశువులు మృత్యువాత పడినా, ప్రమాదానికి గురైనా పరిహారం

అనపర్తి: పాడి పరిశ్రమాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. రైతుల కుటుంబాలకు ఆసరాగా నిలిచే పశువులు, జీవాలకూ వైఎస్సార్ పశు బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చి.. పాడి రైతుకు భరోసా కల్పించారు. మేలుజాతి పశువులను కొనాలంటే పాడి రైతులు లక్షలాది రూపాయలు వెచ్చించాల్సిందే. విలువైన పశువులను కోల్పోయి, పాడి రైతులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితిని అధిగమించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది.

గ్రామీణ ప్రాంత రైతులు వ్యవసాయం తర్వాత పాడి పరిశ్రమకే అధిక ప్రాధాన్యమిస్తారు. ప్రకృతి వైపరీత్యాలు, నీటి కాలుష్యం, పాము కాటు, అడవి జంతువుల దాడి, వివిధ ప్రమాదాలు, వాతావరణ మార్పులతో పశువులు వివిధ రకాల వ్యాధుల బారిన పడి మరణిస్తుంటాయి. పశువులు, జీవాలు మృత్యువాత పడితే వాటి



బీమా చేసిన ఆవుకు వేసిన చెవిపోగును చూపుతున్న పాడిరైతు

స్థానంలో కొత్త వాటిని కొనుగోలు చేయడానికి పెంపకందారులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేది.

ఈ పరిస్థితుల్లో పాడి రైతులకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ పశు బీమా పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద రైతు చెల్లించాల్సిన బీమా ప్రీమియం వాటాల్లో కూడా ప్రభుత్వం రాయితీ కల్పిస్తోంది. వైఎస్సార్ సీపీ

విస్తృత అవగాహన



వైఎస్సార్ పశుబీమా పథకంపై పాడి రైతులకు అవగాహన కలిస్తున్నాం. జీవాలు మరణించిన రోజుల్లోనే బీమా మొత్తం రైతు బ్యాంకు ఖాతాలకు జమవుతుంది. పాడి రైతులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా వారిని చైతన్య పరుస్తున్నాం. ఆసక్తి ఉన్న పాడి రైతులందరూ వారి పరిధిలో ఉన్న ఆర్బీకే, గ్రామాల్లో పశువైద్య అధికారులను సంప్రదించి.. మూగజీవాలకు బీమా చేయించాలి.

– వై.శ్రీనివాసరావు, ఏడీ, పశు సంవర్ధక శాఖ, అనపర్తి

ప్రభుత్వం అమలు చేసే ఈ పథకంతో ఏదైనా కారణంతో పశువులు మరణిస్తే, వాటి యజమానులకు ఆర్థికంగా ఊరట కలిగించేలా పథకాన్ని రూపొందించారు. ఈ పథకం ద్వారా ఏడాది నుంచి మూడేళ్ల వరకు బీమా చేసుకునే వెసులుబాటు ఉంది.

ప్రీమియం చెల్లింపు ఇలా..

పశు బీమా పథకానికి తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న ఎస్సీ, ఎస్టీ, రైతులతో పాటు బీపీఎల్ రైతులు తమ వాటాగా 20 శాతం, మిగిలిన వారు 50 శాతం ప్రీమియంగా చెల్లించాలి. రూ.30 వేల విలువైన

నియోజకవర్గంలో జీవాల వివరాలు

మండలం	ఆవులు	గేదెలు	మేకలు	గొర్రెలు	పందులు
అనపర్తి	1,256	8,644	621	2,954	361
రంగంపేట	7,623	11,045	3,269	3,123	62
బిక్కవోలు	1,203	5,798	1,996	12,174	234
పెదపూడి	2,160	10,445	542	29	179

పశువులకు మూడేళ్ల కాలానికి ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ వారు తమ వాటి కింద ఒక్కో పశువుకు రూ.384, మిగిలిన వారు రూ.960 బీమా ప్రీమియంగా చెల్లించాలి. దేశవాళీ పశువులకు వైట్ రేషన్ కార్డుదారులు రూ.192, మిగిలిన వారు రూ.480 ప్రీమియంగా చెల్లించాలి. గొర్రెలు, మేకలు, పందులకు బీపీఎల్, ఎస్సీ, ఎస్టీ, పేదవర్గాల వారు ఏడాదికి రూ.36, రెండేళ్లకు రూ.54, మూడేళ్లకు రూ.75 చెల్లించాలి. ఇతర వర్గాలకు చెందిన రైతులు ఏడాదికి రూ.90, రెండేళ్లకు రూ.135, మూడేళ్లకు రూ.187.50 చెల్లించాలి. మరింత అధిక ధరకు బీమా చేయించాలనుకుంటే పశువుల విలువను బట్టి ఎస్సీ, ఎస్టీ వర్గాల వారు 7.68 శాతం, ఇతర వర్గాల వారు 9.5 శాతం చొప్పున ప్రీమియం చెల్లించాలి.

పశువుల రకాన్ని బట్టి సాయం

వైఎస్సార్ పశు బీమా పథకం కింద పశు పోషకులు గరిష్ఠంగా ఐదు గేదెలు, 50 గొర్రెలు లేదా మేకలు లేదా పందులకు బీమా చేయించుకునే అవకాశం ఉంది. సంకరజాతి పశువులు ఆవులు, గేదెలు, ఎద్దులు మరణిస్తే ఒక్కోదానికి రూ.30 వేలు, అలాగే దేశీయ పశుజాతి ఆవులు, గేదెలు, ఎద్దులు మృత్యువాత పడితే రూ.15 వేల చొప్పున పరిహారం అందుతుంది. గొర్రెలు, మేకలు మరణిస్తే ఒక్కోదానికి రూ.6 వేల వరకు పరిహారం ఇస్తారు.

నిబంధనలు ఇలా..

ఉత్పాదక దశలో ఉన్న, ఒకసారి ఈనిన 2–10 ఏళ్లలోపు ఆవులు, 3–12 ఏళ్ల మధ్య వయస్సున్న గేదెలు, ఒకటిన్నరేళ్ల పైబడిన మేలు జాతి దున్నలు, ఎద్దులు, రెండేళ్లు పైబడిన నాటు ఎద్దులు, దున్నలు, ఆరు నెలల వయసు నిండిన గొర్రెలు, మేకలకు ఈ బీమా పథకం వర్తిస్తుంది. పదేళ్లు పైబడిన ఎద్దులు, దున్నలు, ఆరు నెలలలోపు, శాశ్వత అంగవైకల్యానికి గురైన గొర్రెలు, మేకలు, పందులకు ఈ పథకం వర్తించదు.

ఇవి తప్పనిసరి

మూగజీవాలకు బీమా చేయించుకునేందుకు రైతులు బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డ్, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు కుల ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకువెళ్లాలి. బీమా చేయించిన పశువులు, జీవాలకు తప్పనిసరిగా చెవి పోగు వేయించాలి. రోడ్డు, రైలు, అగ్ని ప్రమాదాల్లో పశువులు మరణిస్తే, ఎఫ్ఐఆర్ నమోదు చేయించాలి. బీమా చేయించిన పశువులు, జీవాలు మరణిస్తే వెంటనే సమీపంలో ఆర్బీకేలో పశువైద్య సహాయకునికి విషయాన్ని తెలియజేయాలి. లేదా 1962 నంబరుకు సమాచారం ఇవ్వాలి.

మహిళల ఆర్థికాభ్యున్నతే జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి
- మహిళలకు ఆసరా చెక్కుల అందజేత



ఆరికరేవులలో లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: రాష్ట్రంలో మహిళల ఆర్థికాభ్యున్నతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం ఆరికరేవుల, మెళ్లూరు గ్రామాల్లో నాలుగో విడత వైఎస్సార్ ఆసరా పథకం చెక్కులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు నాలుగు విడతల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా రుణ మాఫీ చేశారన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో సీఎం తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులకు మన రాష్ట్రం విద్యారంగంలో ప్రథమ స్థానానికి ఎగబాకిందని, పేదరికం తగ్గిందన్నారు. ప్రజల కోసం నిరంతరం శ్రమించే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నాలుగో విడతగా ఆరికరేవుల గ్రామంలోని 45 సంఘాల 435 మంది సభ్యులకు రూ.50.71 లక్షలు, మెళ్లూరు గ్రామంలో 39 సంఘాల 372 మంది సభ్యులకు రూ.51.30 లక్షల నగదు వారి ఖాతాల్లో జమ అయినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ స్థాయీ సంఘ చైర్మన్ రొంగల పద్మావతి, వైఎస్సార్ సీపీ



జి.మామిడాడలో డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి

జేసీఎస్ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, పార్టీ నాయకులు గురు నాగు, మెళ్లూరు సర్పంచ్ పెద్దిరెడ్డి సత్యసాయి, ఉప సర్పంచ్ కొమ్మన ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి సీఎం జగన్ కృషి

పెదపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని గండ్రేడు, జి.మామిడాడ, పైన, చింతపల్లి, రాజుపాలెం, వేండ్ర గ్రామాల్లో ఆయా సర్పంచులు కుడుపూడి మాధవీలత, లంక మున్ని, గుత్తుల పుష్పావతి, సుందరపల్లి ప్రమీల, కొల్లు లోవకుమారి, కోసూరు వాసు ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత రుణమాఫీ చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మహిళలంతా ఆయనకు మద్దతు తెలిపి మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలన్నారు. తనను రెండోసారి భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం మహిళలు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేత తులసి, జెడ్పీటీసీ వేపకాయల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, సొసైటీ చైర్మన్ సబ్బెళ్ల అమ్మిరెడ్డి, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, ఎంపీటీసీలు సుందరపల్లి సుధాకర్‌బాబు, కర్రి వెంకట పద్మావతి, కర్రి శ్రీవెంకటరెడ్డి, గ్రామ కన్వీనర్ ద్వారంపూడి సూర్యనారాయణ రెడ్డి(హంస), జిల్లా కమిటీ సభ్యుడు కొల్లు పెద్దకాపు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు డివిడెండ్, వడ్డీ రాయితీ పంపిణీ

బిక్కవోలు: మెళ్లూరు సొసైటీలో రైతులకు డివిడెండ్, వడ్డీ రాయితీలను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పంపిణీ చేశారు. సోమవారం మెళ్లూరు సొసైటీ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో 450 మంది రైతులకు రూ.1.95 లక్షల డివిడెండ్ అందించారు. అలాగే వడ్డీ రాయితీగా రూ.5 లక్షలు రైతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటూ, వ్యవసాయం లాభసాటిగా ఉండేలా అనేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు వస్సే సత్యనారాయణ, సర్పంచ్ పెద్దిరెడ్డి సత్యసాయిరాం, ఉప సర్పంచ్ కొమ్మన ఆనంద్, వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, పార్టీ నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ రొంగల అప్పాజి, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ పెద్దిరెడ్డి శ్రీనివాసరావు, కొమరిపాలెం ఉప సర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, సొసైటీ కార్యదర్శి కొర్ల వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు మాగపు వెంకన్న, కొమ్మన ఆదినారాయణ, యరుబండి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మధురపూడి: కోరుకొండ మండలం మధురపూడి, జంబూపట్నం, నర్సాపురం గ్రామాల్లోని పలు కుటుంబాలను వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి సోమవారం పరామర్శించారు. మధురపూడికి చెందిన కొల్లపు సూరిబాబు, మేడే నాగేశ్వరరావు, మద్దాల సుబ్బారావు ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను విజయలక్ష్మి ఓదార్చారు. జంబూపట్నంలోని కోరుకొండ ఎంపీపీ ఉల్లి వీర వెంకట సత్య సూర్యకుమారి తండ్రి తేలు సూర్యచంద్రరావు మృతి చెందారు. అదే గ్రామంలోని వైఎస్సార్ సీపీ నాయకుడు నాగా రమేష్ తండ్రి ఇటీవల వృద్ధాప్యంతో మరణించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట మండలం కో కన్వీనర్ గణేశుల



మధురపూడిలో సూరిబాబు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

పోసయ్య, నాయకులు బత్తిన త్రిమూర్తులు, ఇండిగమెల్లి సత్యనారాయణ, ఆకుల శ్రీను తదితరులు ఉన్నారు.

ఆడుదాం ఆంధ్రాతో యువతకు భవిష్యత్తు



విజేత జట్లకు షీల్డ్, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న సబ్బెళ్ల కృష్ణారెడ్డి తదితరులు

ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి

అనపర్తి: గ్రామీణ స్థాయి నుంచి యువ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయడంతో పాటు, వారికి ఉన్నత భవిష్యత్తును అందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి సభకు అధ్యక్షత వహించారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. క్రీడాకారులను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం వివిధ క్రీడల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు కృష్ణారెడ్డి, అతిథులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, పంచాయతీ విస్తరణాధికారి పద్మజ, వైఎస్సార్ సీపీ జిల్లా వాణిజ్య విభాగం కన్వీనర్ ఎస్ఎస్, జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కొండేటి భీమేష్, క్రీడా పోటీల కోఆర్డినేటర్ పి.శ్రీనివాసరెడ్డి, పాఠశాల హెచ్ఎం పులగం వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా భీమేష్

అనపర్తి: వైఎస్సార్ సీపీ తూర్పుగోదావరి జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా గ్రామానికి చెందిన ఎంపీటీసీ–4 కొండేటి భీమేష్ నియమితులయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా నుంచి ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పార్టీ ఆవిర్భావం నుంచి భీమేష్ విశేష సేవలందిస్తున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఇతర నాయకులకు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా, రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని భీమేష్ తెలిపారు. ఈ పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి భీమేష్‌కు జిల్లా పదవిని కట్టబెట్టినట్టు పేర్కొన్నారు. అనంతరం భీమేష్‌ను



భీమేష్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తదితరులు

ఘనంగా సత్కరించారు. ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి తదితరులు భీమేష్‌కు అభినందనలు తెలిపారు.

భర్తను హత్య చేసిన భార్య

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): చెడు అలవాట్లకు బానిసైన భర్తను మహిళ హత్య చేసిన సంఘటన స్థానిక రామచంద్రరావుపేటలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడబండి సత్తిబాబు (32)కి జ్యోతితో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి పిల్లలు లేరు. భార్యాభర్తలిద్దరూ గోకవరం బస్టాండ్ వద్ద బిర్యానీ పాయింట్‌లో పని చేస్తున్నారు. సత్తిబాబు నిత్యం మద్యం తాగి వస్తుండేవాడు. ఈ క్రమంలో సత్తిబాబు ఆదివారం రాత్రి యథావిధిగా ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో భార్యాభర్తలిద్దరూ ఘర్షణ పడ్డారు. కోపంతో ఉన్న జ్యోతి కూరగాయలు కోసే కత్తిని సత్తిబాబుపై విసిరింది. సత్తిబాబు పొట్టకు తీవ్రగాయం కావడంతో వెంటనే ఆసుపత్రికి తరలించారు. అక్కడ సత్తిబాబు చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. దీనిపై మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యాభివృద్ధితోనే సమాజ అభ్యున్నతి



లక్ష్మీనరసాపురం హైస్కూల్‌లో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న తాతారెడ్డి, పద్మావతి

పెదపూడి: సమాజాభ్యున్నతి విద్యాభివృద్ధితోనే సాధ్యమవుతుందని జి.మామిడాడ గ్రామ ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, ఎంపీటీసీ కర్రి వెంకట పద్మావతి అన్నారు. జి.మామిడాడ గ్రామం శివారు లక్ష్మీనరసాపురం హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాతారెడ్డి, పద్మావతి మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. ఇంగ్లిష్ మీడియం, అమ్మ ఒడి, విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, విద్యా దీవెన, విద్యా వసతి, నాడు–నేడు వంటి పథకాలు అమలు చేశారన్నారు. ప్రతి పేదవాడి ఇంట్లో విద్యా వెలుగులు నింపడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బీఎస్‌వీ సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్మినెంట్ లోక్ అదాలత్‌పై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లా ప్రధాన న్యాయస్థానం ఆవరణలో సోమవారం ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పర్మనెంట్ లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్ హైలెవెల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాకు సంబంధించిన వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల అధికారులు, ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ న్యాయ సేవాధికార సంస్థల చట్టం 1987 ద్వారా ఏర్పాటు చేసిన పర్మనెంట్ లోక్ అదాలత్ విధులను వివరించారు.

ఉమ్మడి జిల్లా పరిధిలోని విద్యుత్, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, వైద్యం, తపాలా, టెలిఫోన్, బీమా సంస్థలు, బ్యాంకింగ్ వంటి పది రకాల సేవలకు సంబంధించిన సమస్యలను జిల్లా న్యాయస్థాన ఆవరణలోని పర్మనెంట్ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. దీనికి రూ.కోటి వరకూ పరిధి ఉందని, ఈ తరహా వివాదాలలో కోర్టు ఫీజు లేకుండా రాజీమార్గం ద్వారా సత్వరమైన పరిష్కారం పొందవచ్చన్నారు. రాజీ కుదరని పక్షంలో విచారణ జరిపి తీర్పు ఇవ్వబడుతుందన్నారు. ఈ విషయాలపై ప్రజలకు అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పర్మనెంట్ లోక్ అదాలత్ సేవలను మరింత మెరుగైన విధంగా అందించేందుకు పలు సూచనలు చేశారు. సమావేశంలో ప్లాపస్ చైర్మన్ ఏ.గాయత్రీ దేవి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, ఎస్.శ్రీధర్, వై.లక్ష్మణరావు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్‌లో పతకాలు

ప్రకాశం నగర్: విజయవాడ ఫన్ టైమ్స్ టేబుల్ టెన్నిస్ అకాడమీలో జరిగిన 85వ ఏపీ స్టేట్ మాస్టర్స్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీ కోచ్ వీటీవీ సుబ్బారావు పాల్గొన్నారు. 50 ప్లస్ పురుషుల సింగిల్స్ విభాగంలో ద్వితీయ బహుమతి, డబుల్స్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించారు. రాష్ట్రంలోని వివిధ నగరాలకు చెందిన 120 మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో పోటీపడ్డారు. కాగా.. కోచ్ సుబ్బారావును జిల్లా అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వి.భాస్కరరామ్, అధ్యక్షుడు జేవీవీ అప్పారెడ్డి, కోశాధికారి కె.సత్యనారాయణ, అసోసియేషన్ సభ్యులు, అకాడమీ క్రీడాకారులు అభినందించారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని గంగిరెడ్డుల కాలనీలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంపై బొమ్మూరు ఎస్సై జుబేర్, సిబ్బందితో కలిసి సోమవారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఆరు 180 ఎంఎల్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటిని అక్రమంగా విక్రయిస్తున్న విత్తనాల విజయలక్ష్మి పరారీలో ఉందన్నారు.

లోతైన అవగాహనతోనే లక్ష్య సాధన



డీఈవో అబ్రహాన్ని సత్కరిస్తున్న డైట్ ప్రిన్సిపాల్ రమణ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: అన్ని అంశాలలో లోతైన అవగాహన పెంచుకోవడం ద్వారా అనుకున్న లక్ష్యాలను సాధించగలరని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో)ఎస్.అబ్రహం అన్నారు. బొమ్మూరులోని జిల్లా విద్యాశిక్షణాసంస్థ (డైట్)లో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్ఈడి) 2023–25 కేలండర్‌ను ఆయన సోమవారం ఆవిష్కరించారు. అనంతరం డీఈవో అబ్రహంను శాలువా, మెమెంటో, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా కొమ్ముల వెంకట సూర్యనారాయణ రచించిన బాలకథాచంద్రిక కథల సంపుటిని డీఈవోకు అందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ మాట్లాడుతూ ఛాత్రోపాధ్యాయులు డీఎల్ఈడీ కేలండర్‌ను కూలంకషంగా పరిశీలించి సద్వినియోగ పరచుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాలరాజు, గంగాధర్, సుజాతారత్నం, జానకీదేవి, ఎస్తర్, కళావతి, రామకృష్ణ, రాజేష్ పాల్గొన్నారు.